ప్రొటోకాల్‌ పాటించకుండా పనులు ప్రారంభిచడమేంటి?

కాంగ్రెస్‌ నాయకులను ప్రశ్నించిన బీఆర్‌ఎస్‌ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద కాంగ్రెస్‌ నాయకులు అనధికారికంగా, ప్రొటోకాల్‌ పాటించకుండా రోడ్డు పనులను ప్రారంభించడమేంటని భారత రాష్ట్ర సమితి పోచారం మున్సిపల్‌ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్‌ ప్రశ్నించారు. శుక్రవారం పోచారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్‌ అధికారులు, పాలకవర్గం, ఇతర ప్రజాప్రతినిధులు లేకుండా గురువారం రహదారి పనులకు భూమిపూజ చేయడాన్ని ఖండించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను పార్టీ కార్యక్రమంగా నిర్వర్తించినట్లుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన తోటకూర వజ్రేష్‌ యాదవ్‌ రోడ్డు పనులను ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌ బెజ్జంకి హరిప్రసాదరావు, కోఆప్షన్‌ సభ్యుడు అక్రమ్‌ అలీ, బీఆర్‌ఎస్‌ నాయకులు బద్ధం జగన్మోహన్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, అబ్బవతిని నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్‌, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌ ఐఎన్‌టీయూసీ కార్యవర్గం ఎన్నిక

మేడ్చల్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద గల ఆటో స్టాండ్‌ డ్రైవర్లు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయరావు, ఉపాధ్యక్షులుగా నాగేందర్‌, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌ కోశాధికారిగా నర్సింగ్‌రావు తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు ఇన్‌స్పెక్టర్‌ సత్యనారయణ ను కలిసి పరిచయం చేసుకున్నారు.



ఇన్‌స్పెక్టర్‌ ను కలిసిన ఆటో డ్రైవర్‌ యూనియన్‌ నాయకులు

రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్లు



కీసర: చీర్యాలలో ప్రజలకు తాగునీరు అందించేందుకు రాంకీసంస్థ ఆధ్వర్యంలో మూడు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు కీసర మండల కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్‌, గ్రామ మాజీ సర్పంచ్‌ తుంగ ధర్మేందర్‌లు అన్నారు. శుక్రవారం ఈమేరకు ఆర్వో ప్లాంటు ఏర్పాటులో కొత్తగా వేసిన బోరుమోటారును ప్రారంభించారు.

మున్సిపాలిటీలో చైర్‌ పర్సన్‌ పర్యటన

ఘట్‌కేసర్‌: చెత్తను రోడ్లపై వేయకుండా తడి పొడి చెత్తగా వేరు చేసి చెత్తను సేకరించే వాహనంలోనే వేయాలని చైర్‌ పర్సన్‌ పావనీ జంగయ్య అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 16వ వార్డులో చైర్‌ పర్సన్‌ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను సేకరించే వాహనానికి ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, వార్డు ప్రజలు తరపున వాహనానికి అయ్యే వ్యయం తామే సొంతంగా చెల్లిస్తామన్నారు. అలాగే వార్డు లోని బస్తీ దవాఖానాను సందర్శించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్‌, పాషా, లత, లక్ష్మీ, కేస్కర్‌, విజయ్‌, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌ బస్తీ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ధోబీఘాట్‌ స్థలాన్ని అప్పగించండి

గౌతంనగర్‌: జ్యోతినగర్‌లోని ధోబీఘాట్‌ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రజకులు ధోబీఘాట్‌ ఏర్పాటు చేసుకుని అక్కడే తమ కుల వృత్తి చేసుకునేవారన్నారు. అయితే గతంలో ధోబీఘాట్‌ని అధునాతన సౌకర్యాలతో నిర్మించి ఇస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు రజకులను కోరడంతో కూల్చివేశారన్నారు. అనంతరం చుట్టూ ప్రహరీ నిర్మించిన తర్వాత స్థానిక కాలనీవాసులు ఈ స్థలం కాలనీకి చెందిందని అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. అదేవిధంగా ధోబీఘాట్‌లో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూడా గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రజకులకు తాను అండగా ఉంటానని అవసరమైతే హైకోర్టుకు వెళ్లి ధోబీఘాట్‌ను అప్పగించే వరకు పోరాటం చేస్తానన్నారు. వెంటనే అధికారులు సర్వే చేసి రజకులకు స్థలాన్ని అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ గౌతమ్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన ఉండాలి



అల్వాల్‌: ట్రాఫిక్‌ నిబంధనలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌, నియమాలు, రోడ్లపై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అల్వాల్‌ సెయింట్‌ మైఖేల్‌ స్కూల్‌లో విద్యార్థులకు కార్టూన్‌ వీడియోస్‌ ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ట్రాఫిక్‌ నిబంధనలను వివరిస్తే వారు భవిష్యత్‌లోనూ గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో అల్వాల్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు, పోలీసులు, స్కూల్‌ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్‌



బీగాల శంకర్‌

మల్కాజిగిరి: ఆటో చోరీ కేసులో పాత నేరస్తుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్‌ చేశారు. బీగాల శంకర్‌ (34) చెత్త కాగితాలు ఏరుకుంటూ మల్కాజిగిరి సాయిబాబానగర్‌లో ఫుట్‌పాత్‌ పైన నివసిస్తున్నాడు. గతంలో సుమారు 10 దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. ఈనెల 2న జైలు నుంచి వచ్చాడు. ఇదే నెల 7న మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాల వద్ద పార్కింగ్‌ చేసిన ఆటోను దొంగలించాడు. శుక్రవారం అతనిని మల్కాజిగిరిలో అరెస్ట్‌ చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లోనే నేరస్తుడిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, డీఎస్‌ఐ శంకరయ్యను డీసీపీ పద్మజ అభినందించి రివార్డు ప్రకటించారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌ కుమార్‌



మాట్లాడుతున్న ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌ కుమార్‌



సమావేశానికి హాజరైన ప్రిన్సిపాళ్లు

సాక్షి,సిటీబ్యూరో: ఫీజు బకాయిలు ఉన్నాయని డిగ్రీ, ఇంజనీరింగ్‌ చదివే ఫైనల్‌ ఇయర్‌ ఎస్సీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారిని ఇబ్బందులు కలిగించవద్దని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌ కుమార్‌ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాల్లో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాల ఆన్‌లైన్‌ నమోదుపై కాలేజీల ప్రిన్సిపాళ్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్‌ షిప్పులు కొంత ఆలస్యంగానైనా కాలేజీ అకౌంట్లలో జమ అవుతాయని వినోద్‌కుమార్‌ పేర్కొన్నారు.ప్రతి కాలేజీలలో ఆన్‌లైన్‌ ప్రక్రియను నిర్వహించేందుకు బాధ్యత గల సిబ్బందిని నోడల్‌ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. ఎలాంటి తప్పులు జరుగకుండా జాగ్రత్తగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌ లో నమోదు చేయాలని, ఏవైనా పొరపాట్లు జరిగితే నోడల్‌ ఆఫీసర్లదే బాధ్యత అని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్‌ స్పష్టం చేసారు. విద్యార్థుల ఆధార్‌ నంబర్లను బ్యాంక్‌ అకౌంట్‌తో సీడింగ్‌ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పవర్‌ పాయింట్‌ ప్రజంటేషన్‌ ద్వారా సీజీజీ ప్రతినిధి వినయ్‌కృష్ణ అవగాహన కల్పించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌ రూరల్‌: విద్యుత్‌ మరమ్మత్తుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌ అధికారులు తెలిపారు. మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి 11 కెవి ఫీడర్‌ పరిధిలో మరమ్మత్తుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేడ్చల్‌ కోర్టు రోడ్డు, రాఘవేంద్రనగర్‌, అత్వెల్లి గ్రామం, జయదర్శిని, ఇందిరమ్మ కాలనీ, గంగా వెంచర్‌, హరిహరి టౌన్‌షిప్‌, లోటస్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ అంతరాయం కలుగుతుంది.

వెంకటేశ్వర గుట్ట ఫీడర్‌ పరిధిలో...

మండలంలోని రాజబొల్లారం పరిధిలోని 11 కెవి వెంకటేశ్వర గుట్ట ఫీడర్‌ పరిధిలో మరమ్మత్తుల కారణంగా వేంకటేశ్వర స్వామి ఆలయం , హెచ్‌ఎండబ్ల్యు వాటర్‌ సప్లై, జీఆర్‌బీ, టాటా కంపెనీ, సాయికృష్ణ స్టోన్స్‌ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్‌ రూరల్‌: మండలంలోని రావల్‌కోల్‌ గ్రామంలో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని మెడిసిటీ క్లినిక్‌ వద్ద నిర్వహించిన శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న పలువురిని ఆస్పత్రిలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అజయ్‌, హితేష్‌, ప్రేరణ, శృతిక, మార్కెటింగ్‌ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమానాలుంటే ఫోన్‌ చేయండి

సాక్షి,సిటీబ్యూరో: ఈ నెల 17,18 తేదీలలో తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహిస్తున్న గ్రూప్‌–3 పరీక్షలకు మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 115 పరీక్షా కేంద్రాలలో 65,361 మంది అభ్యర్థుల హాజరు కానున్నారని జిల్లా కలెక్టరు గౌతమ్‌ పొట్రు ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే అభ్యర్థులు హెల్ప్‌ డెస్క్‌ (040–23542185, 040–23542187)కు ఫోన్‌ చేయవచ్చన్నారు.

బిట్స్‌ పిలానీ, యూనివర్సిటీ ఆఫ్‌ బఫెలోతో ఒప్పందం



జవహర్‌నగర్‌: హైదరాబాద్‌ బిట్స్‌ పిలానీ, యూనివర్సిటీ ఆఫ్‌ బఫెలో (యూబీ) న్యూయార్క్‌ ఎమర్జింగ్‌ టెక్నాలజీస్‌లో గ్లోబల్‌ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడానికి తమ భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం బిట్స్‌ పిలానీ క్యాంపస్‌లో వైస్‌ చాన్సిలర్‌ ప్రొఫెసర్‌ రాంగోపాల్‌రావు, యూనివర్సిటీ ఆఫ్‌ బఫెలో వైస్‌ ప్రెసిడెంట్‌ స్కాట్‌ వెబర్‌లు శుక్రవారం అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బంగారు మైసమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేకల కావ్య

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లోని లక్ష్మీనగర్‌ కాలనీలో బంగారు మైసమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్‌ మేకల కావ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగీతరాజశేఖర్‌, పల్లపు రవి, శారదమనోహర్‌రెడ్డి, జవహర్‌నగర్‌ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌చారి, బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు కొండల్‌ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రొఫెసర్‌ షేక్‌ మసూద్‌

మేడ్చల్‌ రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాలలో ఆర్థిక విద్యపై సర్టిఫికేషన్‌ కోర్సు నిర్వహించారు. రెండురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని శుక్రవారం ఎన్‌ఐఎస్‌ఎమ్‌ ఫైనాన్స్‌ విభాగం అసోసియేట్‌ ప్రొఫెసర్‌ షైక్‌ మసూద్‌, కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్‌ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్‌ లోకనాథం, ట్రెజరర్‌ త్రిలోక్‌రెడ్డి, ఎంబీఏ డీన్‌ నాగరాజు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు



అవగాహన కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు

మేడ్చల్‌ రూరల్‌: యువత డ్రగ్స్‌, ఆల్కాహాల్‌ వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నార్కోటిక్స్‌ బ్యూరో ఎస్పీ సీతారాం అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ గ్రూప్స్‌ ఆడిటోరియంలో శుక్రవారం యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల(డ్రగ్స్‌) దుర్వినియోగం, అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్‌ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సీతారాం మాట్లాడుతూ డ్రగ్స్‌, మత్తు పదార్థాలకు బానిసై యువత పెడదారిన పడుతున్నారని విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నార్కోటిక్‌ డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి, సుబ్బారాంరెడ్డి, ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్‌రావు, గోపి, మేడ్చల్‌ అడిషనల్‌ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్‌ ఇన్స్‌పెక్టర్‌ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్‌ నారాయణ, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల నిలిపివేత తగదు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పరిధిలోని కొన్ని సర్వే నంబర్లలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలన్న వక్ఫ్‌ బోర్డు సీఈవో ప్రకటనపై పునరాలోచించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ పోత్రుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 750 ఎకరాల్లో సుమారు 72 పైగా కాలనీలు ఏర్పడ్డాయని వాటిలో పేద, మధ్య తరగతి ప్రజలు ఇండ్లు నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడా మౌలిక వసతులు కల్పించిందన్నారు. వక్ఫ్‌ భూముల పరిరక్షణకు తాను వ్యతిరేకం కాదని, అయితే అక్కడ దశాబ్దాలుగా ఉన్న పేదప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.



కలెక్టర్‌ గౌతం పోత్రుకు వివరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నాగోల్‌ మెట్రోస్టేషన్‌ పార్కింగ్‌ వద్ద ఆందోళన

ఉప్పల్‌: పార్కింగ్‌ దోపిడికి నిరసనగా నాగోల్‌ మెట్రో పార్కింగ్‌ స్థలం వద్ద ప్రయాణికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల పార్కింగ్‌కు 12 గంటల వరకు రూ. 25 వసూలు చేస్తున్నారని అది దాటితే గంటకు రూ. 5 చొప్పున వసూలు చేస్తున్నారని, ఇదేంటని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్‌ స్థలంలో సరైన వసతులు కల్పించిన తర్వాతే పార్కింగ్‌ ఫీజును నామమాత్రంగా తీసుకోవాలని, అలా కాకుంటే అన్ని స్టేషన్లలో పార్కింగ్‌ ఫీజును రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు.



నాగోల్‌ మెట్రో పార్కింగ్‌ వద్ద ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

ఘనంగా ఛట్‌ పూజ

మేడ్చల్‌: దీపావళి తర్వాత ఉత్తర భారతీయులు ఘనంగా జరుపుకునే ఛట్‌ పూజా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.మున్సిపల్‌ పరిధిలోని అత్వెల్లి బుడమ కుంట వద్ద శుక్రవారం ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యస్తమయానికి ముందు గంగమ్మ తల్లి వద్ద పూజలు చేశారు.

పాల్గొన్న ఎంపీ ఈటల..

అత్వెల్లి చెరువు వద్ద నిర్వహించిన ఛట్‌ పూజల్లో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ పాల్గొన్నారు.



అత్వెల్లి చెరువు వద్ద మహిళల పూజలు





పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల

సర్వేలో ఎలాంటి లోపాలు ఉండకూడదు

జిల్లా అదనపు కలెక్టర్‌రాధికా గుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను జాగ్రత్తగా ఎలాంటి లోపాలు జరుగకుండా నిర్వహించాలని మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా (లోకల్‌ బాడీస్‌)అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం నిజాంపేట, దుండిగల్‌ మున్సిపాలిటీలలో ఆమె పర్యవేక్షించారు. సర్వేలో వివరాలను సేకరించేటప్పుడు కుటుంబ యజమానులు వారి ఆధార్‌, ఓటర్‌, అవసరమైన కార్డులను ఎన్యుమరేటర్లకు చూపించేలా ముందుగానే తెలుపాలని రాధికా గుప్తా సూచించారు. అనంతరం దూలపల్లి, బాచుపల్లిలలో గ్రూప్‌ –3 పరీక్షలకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూంలను జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా పరిశీలించారు.

రైతు బీమా చెక్కు అందజేత



కీసర: నాగారం మున్సిపల్‌ పరిధిలోని రాంపల్లికి చెందిన రైతు అరిగే జంగయ్య ఆరునెలల క్రితం గుండెపోటుతో మరణించాడు. ఈమేరకు మృతుడి కుటుంబసభ్యులకు రైతు బీమా పథకం కింద రూ 5లక్షలకు సంబంధించిన చెక్కు శుక్రవారం మంజూరైంది. ఈమేరకు మృతుడు అరిగే జంగయ్య సతీమణి అరిగే లక్ష్మీకి రూ 5 లక్షల చెక్కును గ్రామస్తులు అందజేసారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ ఎలిజాల నాగేష్‌గౌడ్‌, కళావతి, మేడ్చల్‌ జిల్లా మాజీ రైతు సమన్వయ సమితి డైరెక్టర్‌ గండి అంజయ్యగౌడ్‌ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌, మాదారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్టేట్‌ విజిలెన్స్‌ బృందం సభ్యులు ఎస్పీ శశిధర్‌ రాజు, డీఎం సుగుణబాయి. డీసీఓ వెంకట్‌రెడ్డితో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రికార్డులు, తూకం పరిశీలించారు. కేంద్రలో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ జగదీశ్‌, కేంద్రం ఇన్‌చార్జ్‌ చెన్నయ్య, ప్రవీణ్‌, రైతులు పాల్గొన్నారు.

సదర్‌ ఉత్సవాలకు రండి



జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌లో ఈ నెల 10న నిర్వహించే సదర్‌ సమ్మేళనానికి రావాలని కార్పొరేటర్‌, ఉద్య ఫౌండేషన్‌ ఫౌండర్‌ మేక లలితాయాదవ్‌ శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌ రావు, మేడ్చల్‌ జిల్లా బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు శంబీపూర్‌ రాజులను కలిసి ఆహ్వానపత్రం అందచేశారు. బీఆర్‌ఎస్‌ నాయకులు నర్సింహయాదవ్‌, ఉద్య ఫౌండేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



నాగారం మున్సిపాలిటీలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్‌ నేతలు

కీసర: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాగారం ,దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శుక్రవారం కాంగ్రెస్‌ నేతలు ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. నాగారం మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, నాగారం మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు ముప్ప రామరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరు వెళ్లొచ్చేసరికి చోరీ

ఘట్‌కేసర్‌: ఊరు వెళ్లి వచ్చేలోపు ఇంటిలో చోరీ జరిగిన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. డీఐ తెలిపిన మేరకు.. మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీనగర్‌ లక్ష్మీనగర్‌కు చెందిన మేకల రమేశ్‌ ఈ నెల 6 రాత్రి ఇంటికి తాళం వేసి ఘట్‌కేసర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం రాత్రి ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా అల్మారాలోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో వెతకగా ఓ బంగారు గొలుసు, రెండు ఉంగరాలు కలిపి తులం న్నర బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో అతడు వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు వ్యాపించి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు వరుణ్‌

జవహర్‌నగర్‌: ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా మంటలు వ్యాపించి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌ ప్రగతినగర్‌లో నివసించే శానమ్మ, కుమారుడు వరుణ్‌ (7) ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం స్కూల్‌ నుండి వచ్చిన వరుణ్‌ టీవీ చూస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలు తెగిపడి మంటలు అంటుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో కుటుంబ సభ్యులెవ్వరూ లేకపోవడంతో బాలుడిని కాపాడలేక పోయారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.